
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# మంచి మరక

" మనోజ్ మీ బట్టలన్నీ పెట్టుకున్నారు కదా! పెట్టె మూసేస్తున్నా!" అంది జాహ్నవి..

"ఆ, జానూ, ఒక బుక్ పెట్టాలి, అంతే!" అన్నాడు మనోజ్ చేతిలో ఫోన్ మీదనించి కళ్ళు తిప్పకుండానే చెప్పాడు.

" ఓ, ఇంకానా? ఐ హోప్ వి ఆర్ ఓకే విత్ ద వెయిట్." అంటూ అతనిచ్చిన పుస్తకాన్ని కూడా పెట్టెలో పెట్టి మూసేసింది.

మనిషికి రెండు పెద్ద పెట్టెలు, చెరొకటీ చిన్న పెట్టెలు, ఇద్దరివీ చెరొకటీ బాక్ పాక్ లు, జాహ్నవి హాండ్ బాగ్. అన్నీ ఒకదగ్గర పెట్టింది తనే.

మనోజ్ అన్యమనస్కంగా ఉండడం ఆమె దృష్టిని దాటిపోలేదు. కారణం ఆమెకీ తెలుసు, కానీ చేసేదేమీ లేదు అని ఆమె అభిప్రాయం.

పొట్టపట్టుకుని దూరాభారమనుకోక దేశవిదేశాల్లో స్థిరపడిన అనేక తెలుగు కుటుంబాల్లాంటిదే వాళ్ళదీను. మనోజ్, జాహ్నవి, కవల పిల్లలు అనీష, మౌనిక.. పిల్లలిద్దరూ పెద్దయి చదువులకోసం బయటకు వెళితే ఖాళీ అయిన గూడులాంటి ఇళ్ళ జాబితాలో వాళ్ళూ చేరారు ఈ మధ్యనే.

మనోజ్ కూడా అమెరికా వచ్చినప్పటినించీ వెనక్కి వెళ్ళిపోదామన్న ఆలోచనలో గడిపినవాడే. గట్టిగా నిశ్చయించుకున్నాను అనుకున్న ప్రతీ సారి ఏదో ఒకటి జరిగి ఉండిపోవలసి వచ్చింది అతనికి. స్వతహాగా సున్నిత మనస్కుడు, తను పుట్టిన గడ్డమీద, తనవారి మీద అపరితమైన ప్రేమ కలవాడూ కావడం చేత ప్రతీసారి నిజాయితీ గానే ప్రయత్నించేవాడు ఊరికే పై పై మాటలు కాక. అయినా కుదరలేదు అతనికి.. తల్లి తండ్రులిద్దరూ ఒకరి తర్వాత ఒకరు దాటిపోయాకా ఇంక ఆ ఆలోచన విరమించుకున్నాడు ఈ మధ్యనే.

వాళ్ళది తూర్పు గోదావరి జిల్లాలో ఒక పల్లెటూరు.

మనోజ్, అన్న మాధవ, చెల్లెలు మంజరి.. తల్లి భవాని, తండ్రి శివరామయ్య.. నానమ్మ శేషమ్మ.. ఇది వారి కుటుంబం..

ఉభయభాషాప్రవీణ అయిన  తండ్రి గవర్నమెంట్ స్కూల్లో తెలుగు, సంస్కృతం చెప్పేవారు. చాలా మామూలు దిగువ మధ్యతరగతి సంసారం. రైలు పెట్టెల్లా వరసగా ఉండే మూడు గదుల అద్దె ఇంట్లోనే వారి నివాసం.

శివరామయ్య గారికి, ఆయన నాన్నకీ ఒకే కల ఉండేది.. ఎప్పటికైనా తమ ఊర్లోనే స్వంత ఇల్లు కట్టుకోవాలని. తండ్రి బ్రతికుండగా తీరని ఆ కలని కనీసం తల్లి దాటిపోయేలొపైనా తీర్చాలని శివరామయ్య గారి ఆశ.

ఆశకి, ఆదాయానికి పొత్తు కుదరని సంసారం.. ఎంత గుట్టుగా, జాగ్రత్తగా గడిపినా తీరే విషయం కాదు మరి.. అప్పంటే భయం, తీర్చే మార్గమే లేనప్పుడు తేవడం ఎందుకు? అనేది ఆయన అభిప్రాయం.

భార్య భవాని కూడా భర్త మనసెరిగి నడుచుకుందే తప్ప, భారమైనవీ, కోరరానివీ ఎప్పుడూ కోరలేదు. తను కష్టపడలేదు, ఆయన్ని పెట్టలేదు.. కానీ పుట్టిన ఊర్లో అద్దె ఇంట్లో ఉండడం అంటేనే వాళ్ళిదరికీ కొండంత బాధ.

బాగా చదువుకుంటున్న ముగ్గురుపిల్లల చదువులు ప్రస్తుతానికి పరవాలేదు కానీ ఆపైన ఎలా? అనేది మొదటి సమస్య..

ఎప్పుడో ఒకప్పుడు పెళ్ళి చేసి పంపాలి కదా, పిల్ల పెళ్ళికి ఎలా?  అన్నది మరొకటి..

ఆపైనే కదా ఇల్లైనా, వాకిలైనా. అనుకునేవారు.. అయినా వీలున్నంతలో ప్రతీ రూపాయీ పొదుపు చేశేవారు.. ఇంటికోసం దాచేవారు. పిల్లల చేతిలో ఎవరైనా రెండు రూపాయలు పెట్టినా, ఎప్పుడైనా ఆవిడ పుట్టింటివారో ఓ వంద రూపాయలు చీర కొనుక్కోమని ఇచ్చినా కూడా భవాని అవన్నీ ఇంటికోసమని దాచేది..

ఫోన్ లో తమ ఇంటి ఫోటోలు చూసుకుంటున్న మనోజ్ మనసులో దాదాపూ నిత్యం కదిలేవే ఇవన్నీ..

" వెళదామా? విజయ్ వచ్చాడు" జాహ్నవి మాటతో సరే అన్నాడు.. విజయ్ జాహ్నవి తమ్ముడు. దగ్గరలోనే ఉండడం వల్ల అక్కా, బావలని ఎయిర్పోర్ట్ వరకూ దింపడానికి వచ్చాడు.

మగవాళ్ళిద్దరూ ముందర సీట్ లో కూర్చున్నాకా, నెమ్మదిగా అన్నాడు విజయ్.. " దీని గురించి ఎక్కువ ఆలోచించి బాధపడకండి బావగారు. ఇవన్నీ జరిగేవే అందరికీ" అన్నాడు అనునయంగా.

" అమ్మా, నాన్న లేరు.. మనమెవ్వరమూ వెళ్ళడం లేదు. ఇల్లు అమ్మేస్తే బావుంటుంది, మన సైన్స్ మేస్టార్ గారి అబ్బాయి పంతులు కొనుక్కుంటానంటున్నాడు. వాడు అక్కడే ఉంటున్నాడు కదా, ఉపయోగం గా ఉంటుంది కూడా. నువ్వు ఒక సారి వస్తే మనం మన ఇంట్లోనే ఓ నాలుగురోజులుండి ఆ వ్యవహారం అంతా పూర్తి చేసుకుని రావచ్చు. మంజు కిచ్చేది దానికిచ్చేస్తే మనకీ ఓ పని అయిపోతుంది"  అని అన్నయ్య మాధవ మరీ,  మరీ చెప్తే ఇంక తప్పని పరిస్థితిలో బయలుదేరాడు.. మనసంతా తన ఊరిమీద, ఇంటిమీదే ఉంది

పొట్ట చేత్తో పట్టుకుని స్వంత ఊరు వదిలి వచ్చిన ప్రతీవారికీ తటస్థపడే సందర్భమే ఇది.. ఎప్పుడు, ఎంత త్వరగా? అన్నదే ప్రశ్న అని.. అయినా ఎందుకో తట్టుకోలేనంత బాధగా ఉంది.

" నువ్వు ఎక్కువ ఆలోచించకు మనూ. తప్పదు. అక్కడకి వెళ్ళి మనం ఉండము అన్నప్పుడు కనీసం ఉపయోగించుకునే వాళ్ళకి ఇచ్చేస్తే అలాగైనా బావుంటుంది కదా మనిల్లు. నేనా? పిల్లల చదువులు అవీ వదిలేసి బెంగుళూరు నుంచి అక్కడకి వెళ్ళను. మంజు వాళ్ళు పూనా లో సెటిల్ అవనే అయ్యారు. నువ్వేమైనా అమెరికా వదిలి అక్కడకి రాబోతావా? ప్రాక్టికల్ గా ఆలోచించు.. " అని ఎన్నో విధాల నచ్చచెప్పాడు తను అభ్యంతర పెట్టిన ప్రతి సారీ.

ఎప్పుడో తాతగారు కొన్న చిన్న స్థలంలో ఇల్లు కట్టాలన్న అతని కోరిక తీరకుండానే అతను పోయారు కనక తన తండ్రి తన హయాంలో ఇల్లు కట్టాలనే కోరిక అంత బలం గా ఉండేది శివరామయ్యగారికి.

" ఇలా ఆలోచిస్తూ ఉంటే మనం ఎప్పటికీ ఏమీ చెయ్యలేం. ఉన్నదేదో చూసి దాంతో కనీసం మొదలు పెడదాం. వెంటనే కాకపోయినా వచ్చే సంవత్సరానికైనా కట్టుకోలేకపోము, ఓ నాలుగ్గదుల ఇల్లు. రంగులూ, హంగులూ వీలు వెంబడి చూసుకోవచ్చు. గచ్చున్నా, లేకున్నా ఓ కప్పుంటే ఇల్లే కదా" అని భవాని ప్రోత్సహిస్తే ఆయన ధైర్యం చిక్కబట్టుకుని నెమ్మదిగా మొదలు పెట్టారు..

మొదటగా చేసిన భూమి పూజ.. శంకుస్థాపన, పునాదులు వేసి కొన్నాళ్ళు ఆరడం కోసమే కాదు, నాన్న ఊపిరి తీసుకోవడానికి కూడా ఆగడమూ అన్నీ మనోజ్ కి నిన్న జరిగినట్టుగా గుర్తున్నాయి..

అదే కాదు. ఆ పునాదులు ఆరిన తర్వాత ప్రతీ రోజూ ఆ ఇంటికోసం జరిగిన కృషి, పడిన శ్రమనీ మర్చిపోలేదు అతను. తన అన్నకీ, చెల్లెలికీ కూడా ఇంచుమించు అంతేనని అతనికి తెలుసు..

ఒక్క తాపీ మేస్త్రీ ని మాత్రం పెట్టుకుని ఇటుకలు మోశారు. లోపలవైపు సిమెంట్ చేయించుకోవడానికి డబ్బు లేనప్పుడు లోపల మట్టి గోడలతో సరిపెట్టుకున్నారు. గచ్చు కూడా ఒక్కొక్కటిగా చేయించుకునేసరికి దాదాపు రెండేళ్ళు పట్టింది.

ఈతాకుల చీపురుతో అక్కడక్కడా వేసిన ఆకుల గుర్తుతో ఎర్ర ఇటుకలతో, రంగులు వెయ్యని ముఖద్వారపు గుమ్మానికి అమ్మ రాసిన పసుపు కుంకుమలే హంగుగా ఎన్నో రోజులుంది ఆ ఇల్లు.. అయినా అది తమ ఇల్లు. ఆ మాట అనుకోవడానికే ఎంతో బావుండేది..

వెనక పందిరి మీద మల్లె తీగని పాకించి, ఇంట్లో రెండు తులసులూ ఉండాలని కృష్ణ తులసి, లక్ష్మి తులసి రెండూ తెచ్చి నాన్న పేర్చిన ఇటుకల తులసి కోటలో వేసి అమ్మ పాడే ' మేడంటే మేడా కాదూ పాటా..'

తానూ అన్నయ్యా మొదటిసారి తమదైన ఒక గదిలో నాయనమ్మ మంచం పక్కన బొంతలేసుకుని కింద పడుకోవడం.. కాస్త పెద్దైన వంట గదిలో అందరూ స్టవ్ పక్కనే గుండ్రంగా కూర్చుని అన్నాలు తినడం..

ఇలా ఎన్నో విషయాలు...

విమానంలో కూర్చుని ఆలోచిస్తున్న అతని చేతిమీద తన చెయ్యి వేసి మెత్తగా చెప్పింది జాహ్నవి..

"ఇంక మర్చిపోవచ్చు కదా! ప్లీజ్ మనోజ్. వీలైతే మనమే కొని మీ నాన్నగారి పేరున ఏదైనా చేద్దామనుకున్నం కదా, కానీ దానికి బావగారు, మంజు ఇద్దరూ ఒప్పుకోలేదు కదా. ఇంతకన్నా మనం చేసేదేముంది?"

అవునన్నట్టు తలూపాడు మనోజ్..

విమానం తన పని తను చేసుకుంటూ పోయింది.. హైదరాబాద్ లో దిగి జాహ్నవి వాళ్ళింటికి కేవలం పలకరింపు కి వెళ్ళి, వెంటనే టాక్సీ మీద మనోజ్ వాళ్ళ ఊరికి బయలుదేరారు..

దారిపొడువునా సాగుతున్న కార్ లాగే ఎడతెగని ఆలోచనలు.. టాక్సీ బయలుదేరిన పది నిమిషాలకి అన్నయ్య ఫోన్ చేశాడు.

" మనూ. వచ్చేశావా? ప్రయాణం బాగా సాగిందా? ఓకే.. అక్కడ మనం ఉండడానికి అన్ని ఏర్పాట్లూ చేశాడు పంతులు.. మనం ఓ నాలుగు రోజులుండి అన్నీ చక్కబెట్టుకుని వద్దమనుకున్నావు కదా.. అందుకే మరీ మరీ చెప్పాను." అంటూ చెప్పాడు.

కొద్దిగా పాతదయినా అందంగా కనబడింది తమ ఇల్లు మనోజ్ కి. సంబరంగా చిన్నపిల్లాడిలా కార్ తలుపు తీసుకుని లోపలకి పరిగెత్తాడు.

అద్దెకి తెచ్చినట్టున్నారు రెండు మంచాలు, పరుపులు వేసి తెల్లటి దుప్పట్లు పరిచారు.. ఇవన్నీ తమ కోసమేనని గ్రహించాడు మనోజ్... ఒక పక్కగా పెట్టీన చిన్న ఫ్రిజ్, 32 ఇంచిల టీవీ. కూలర్.. వీటన్నింటినీ చూసి..

"మీకు కావలసినవి చెప్తే మనింట్లోనే వండించి పట్టుకొస్తాను మనూ.. అలా అనచ్చా?, చిన్నప్పటి చనువుమీద అనేశాను" అంటున్న పంతులుని ఆత్రంగా కౌగలించుకున్నాడు.

"నువ్వేం మారలేదురా!!" అన్నాడు ఆనందంగా. మరో గంటతర్వాత మాధవ్ వచ్చేవరకూ స్నేహితులిద్దరూ కబుర్లలో పడ్డారు స్నేహితులిద్దరూ..

"మీరెవ్వరూరావడం లేదు కదా అని అడిగానురా, అంతేకానీ మరో ఆలోచన లేదు నాకు" అంటూ తను ఇల్లెందుకు కొనుక్కోవాలనుకుంటున్నాడో చెప్పాడు పంతులు..

"నువ్వంతగా చెప్పడానికేముందిరా పంతులూ! అమ్మడమంటూ జరిగితే ఎవరో ఒకరికి ఇవ్వవలసిందే కదా, అది మా స్నేహితుడికయితే మాకు సంతోషమే కదా!" అన్నాడు మాధవ్..

మనోజ్ పెరట్లో తిరుగుతున్నాడు. అమ్మ పెట్టిన మల్లె తీగె లేదు, పాత తులసి కోట అలాగే ఉంది. దాంట్లో ఒక్క తెల్ల తులసి మాత్రమే ఉంది.. ఇంతకుముందు ఇంట్లో అద్దెకున్నవాళ్ళకి తెలీదేమో రెండు తులసి మొక్కలు ఉండాలని! “ అనుకున్నాడు..

చేతిలో కవర్ తో పెరట్లోంచి వచ్చిన తమ్ముడిని చూసి..

"భోంచేద్దామా?" అన్నాడు మాధవ్. ఇద్దరు అన్నదమ్ములూ అక్కడే వేసి ఉంచిన చిన్న బల్లమీద పెట్టుకుని భోజనం చేశారు. కూలర్ వేసుకుని హాయిగా నిద్రపొయాడు మాధవ. మనోజ్ కూడా ప్రయాణపు బడలిక వల్ల బాగానే నిద్రపోయాడు..

ఆ తర్వాత పనులు చక చకా జరిగాయి. నాలుగు రోజులు తాము చిన్నప్పుడు తిరిగిన పరిసరాలన్నీ తిరిగి, కావలసినవాళ్ళని కలిశారు. రిజిస్ట్రేషన్ లాంటి కార్యక్రమాలన్నీ ముగించుకుని అన్నదమ్ములిద్దరూ వెనక్కి బయలుదేరారు..

“ఓ వారం ఉండి, బెంగుళూరు వస్తామన్నయ్యా! మంజు ని కూడా రమ్మంటే ఓ నాలుగు రోజులు ముగ్గురం కలిసి ఉన్నట్టు ఉంటుంది" అన్నాడు హైదరాబాద్ మావగారింటికి బయలుదేరుతూ.

దిగులుపడుతూ వెళ్ళిన భర్త స్థిమితపడి రావడాన్ని చూసి జాహ్నవి సంతోషించింది. ఊర్లో జరిగిన విషయాలన్నీ క్లుప్తంగా చెప్పాడు జాహ్నవికి. తమ ఇంటినీ, ఊరినీ ఎంత మిస్ అవుతాడో చెప్తూనే, తమ ఇల్లు తమ స్నేహితుడే కొనుక్కోవడం పట్ల సంతోషంగా ఉందని భర్త అనడం ఆమెకి ఊరటనిచ్చింది.

"పోనీలెండి మనోజ్.. మీరు సంతోషంగా ఉండడం బావుంది నాకు. మనం మిగతా కార్యక్రమాలు చూసుకోవచ్చు" అంది..

" స్నానం చేసి రండి, టిఫిన్ చేద్దాం" అంది భర్తని.

"లాండ్రీ వేసేద్దామా?” అన్నాడు మనోజ్ అమెరికా అలవాటు చొప్పున..

" అది నేను చూస్తాను, నాగమ్మ కి చెప్తే వాషింగ్ మిషన్ లో వేస్తుంది" అంటూ అతని చేతిలోంచి బేగ్ తీసుకుంది.

బట్టలు బయటకి తీసి ఇస్తూ చూసింది ప్రత్యేకంగా కవర్లో పెట్టి ఉన్న తెల్లటి చొక్కా, మనోజ్ ది.. విప్పి చూస్తే నిండా పరుచుకున్న పెద్ద మరక..

" అరే, కొత్తది, మొన్న పుట్టిన రోజుకు కొనుక్కున్నది.. ఊర్లో మట్టి అంటుకుందేమో.. పడ్డారా ఎక్కడైనా? చెప్పనేలేదే?" అనుకుంటూ తీసి పెట్టింది ఉతకడానికి..

బట్టలు తీసుకెళ్ళడానికి వచ్చిన నాగమ్మ.. "ఈ చొక్కా ఇంట్లో ఉతికితే లాభం లేదమ్మా, డ్రైక్లీనింగ్ కి ఇవ్వాల్సిందే. శానా మట్టి" అంది..

స్నానం చేసి వచ్చిన మనోజ్.. "నాగమ్మా, వద్దు, ఆ చొక్కాని మాత్రం ఏమీ చెయ్యకు. నేను చూసుకుంటాను" అన్నాడు కంగారుగా వచ్చి ఆమె చేతిలోంచి ఆ షర్ట్ ని లాక్కున్నట్టుగా తీసుకున్నాడు.

" అదేంటీ బాబు, మట్టి పట్టేసింది కదా!" అంటున్న నాగమ్మని..

" నాకు తెలుసు,, అదంతా నాకు తెలుసు.. ఇట్ ఈజ్ ఓకే.. " అంటూ దాన్ని జాగ్రత్తగా మడత పెట్టీ మళ్ళీ కవర్లో పెట్టేశాడు.

అర్థం కానట్టుగా చూసింది జాహ్నవి భర్త వైపు..

" అదేంటి మనోజ్.. ఎందుకు?" అంటున్న ఆమెని మధ్యలోనే ఆపి..

" వద్దు జానూ.. దీన్ని ఉతకద్దు. దీన్నిలాగే తీసుకెళతాను.. మళ్ళీ వేసుకోలేకపోయినా పరవాలేదు, నా దగ్గరుంటే చాలు" అన్నాడు.

అర్థమయ్యీ అవనట్టుంది ఆమెకి.. కానీ " ఆ మరకలు"

" మంచి మరక జానూ.. మా ఊరి, మా ఇంటి మట్టి మరక.. ఇక నాకు మిగిలిన మంచి మరక"

"  మరక మంచిదే" టీ.వీ లో ప్రకటన వస్తోంది..

●●●

Click here to share your comments on this story